


మహాలక్ష్మీ అలంకరణలో కట్టమైసమ్మ



నగరేశ్వర దేవాలయంలో లలితా దేవిగా..



మహాచండీ అవతారం

అమ్మ వైభవం.. భక్తుల తన్మయత్వం

తాండూరు పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో జరుగుతున్నాయి. వరసిద్ధి వినాయక దేవాలయం, ఆదర్శ తులసీ నగర్, సాయిపూరు, బసవణ్ణకట్ట, ఇందిరానగర్, పాత తాండూరు తదితర ప్రాంతాల్లో అమ్మవారికి పూజలుచేస్తూ మహిళలు తన్మయత్వం చెందుతున్నారు. నగరేశ్వర దేవాలయంలో అమ్మవారిని సోమవారం లలితా దేవిగా, పాత కుంట కట్టమైసమ్మ ఆలయంలో మహాలక్ష్మిగా అలంకరించారు. ఉద్దండాపూర్‌లో మహాచండీ మాతగా దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే, తాండూరు టౌన్, తాండూరు గ్రామీణ.

అనంతుడికి గరుడ వాహన సేవ



వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం వికారాబాద్ ఆలంపల్లిలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కిరణ్‌పటేల్, ఆలయ ధర్మకర్త పద్మనాభం పాల్గొని పల్లకిని మోశారు.

గర్భిణి మృతిపై విచారణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఇటీవల గర్భిణి అక్షిత మృతి చెందిన ఘటనపై వైద్యాధికారులు విచారణ చేశారు. జిల్లా ఉప వైద్యాధికారి రవీందర్ సోమవారం ఆస్పత్రిని సందర్శించి గర్భిణికి చికిత్స చేసిన వైద్యురాలిని సంఘటనపై ప్రశ్నించారు. మృతికి దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. ఏ సమస్యతో ఆమె ఆస్పత్రికి వచ్చింది, మీరు ఎలాంటి వైద్యం చేశారని అడిగారు. చికిత్సకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

గురుకుల హబ్‌గా కొడంగల్

న్యూస్‌టుడే, కొడంగల్, పరిగి:

భవనాలకు మొదటి విడత రూ.76.45 కోట్లు విడుదల



బీసీ గురుకుల జూనియర్ కళాశాల నిర్మించే ప్రదేశం

ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌ను 'గురుకుల హబ్'గా మారుస్తోంది. దీనికోసం మొదటి విడతగా రూ.73.45 కోట్లను విడుదల చేసింది. మరో రూ.70 కోట్లు రెండో విడత మంజూరు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామంలో గిరిజన గురుకుల పాఠశాల పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో బీసీ బాలుర జూనియర్ కళాశాల, బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ వద్ద బీసీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ బాలుర గురుకులానికి అదనపు గదులు, మౌలిక సదుపాయాలు ఇలా అన్నింటికి కలిపి ప్రత్యేకంగా ఈ నిధులు వెచ్చిస్తారు. దీంతో దూర ప్రాంతంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు కొడంగల్‌కు రానున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు అవకాశం

కొడంగల్ పట్టణ శివారులో 132 సబ్‌స్టేషన్ పక్కనే మహాత్మ జ్యోతిబా పులే బాలుర గురుకుల పాఠశాల 15 సంవత్సరాలుగా కొనసాగుతోంది. విద్యార్థులకు సొంత భవనం నిర్మించినా, ఉపాధ్యాయులు ఉండేందుకు వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం గురుకుల పాఠశాలకు రూ.23.45 కోట్లు విడుదల చేయడంతో మౌలిక వసతులు కల్పించేందుకు వీలు కలుగుతోంది.

మొయినాబాద్‌లో అద్దె భవనంలో కొనసాగింపు

కొడంగల్‌కు బీసీ గురుకుల కళాశాల 5 సంవత్సరాల క్రితం మంజూరు కావడంతో కొంత కాలం పాఠశాల గదుల్లోనే కొడంగల్‌లో నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో మొయినాబాద్‌లోని కనకమామిడి వద్ద అద్దె భవనంలోకి మార్చారు. బాలుర గురుకుల కళాశాలకు రూ.25 కోట్లు విడుదల కావడంతో పాత కొడంగల్ గ్రామంలో నిర్మాణం పనులు చేపట్టనున్నారు.

గురుకులాలు	విద్యార్థులు	కేటాయింపు (రూ. కోట్లు)
పులే బాలుర	480	23.45
బీసీ కళాశాల	280	25
బురాన్‌పూర్ బీసీ	680	25

ఎక్కడవి అక్కడే నిర్మాణం అవుతాయి

బీసీ బాలికల పాఠశాల, కళాశాలలు రెండు బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ వద్దనే నిర్మిస్తారు. అలాగే బీసీ బాలుర గురుకుల పాఠశాల మాత్రం మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ వద్ద నిర్మిస్తారు. ప్రస్తుతం బాలుర ఉన్నత పాఠశాలకు సంబంధించి 132సబ్‌స్టేషన్ పక్కనే ఏర్పాట్లు చేస్తారు. – వెంకట్‌రెడ్డి, 'కడ' కార్యాలయం ప్రత్యేక అధికారి, కొడంగల్.

● బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ గ్రామానికి మంజూరైన బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు సొంత భవనం లేదు. దీంతో చేవేళ్ల సమీపంలోని ఊరెళ్లలో అద్దె భవనంలో నిర్వహిసున్నారు. సొంత భవనానికి రూ.25 కోట్లు విడుదలయ్యాయి.

భూసేకరణ రద్దు చేయాలని 9న పాదయాత్ర



కార్యకర్తలు, నేతలతో మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి

కొడంగల్, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం రైతుల నుంచి చేస్తున్న భూసేకరణను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఈనెల 9న పాదయాత్ర చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన బొంరాస్‌పేట మండలం గౌరారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9న ఉదయం 7గంటలకు హకీంపేట నుంచి పాదయాత్ర చేస్తామన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. ఫార్మాసిటీ కోసం తెలంగాణ రాష్ట్రంలో ఒకే దగ్గర ఉండేలా గత ప్రభుత్వం మహేశ్వరం, ఇబ్రాహీంపట్నం మధ్య 14వేల ఎకరాలను సేకరించినట్లు ఆయన గుర్తు చేశారు. ఆ ప్రాంతంలో కాకుండా రైతులు సాగు చేస్తున్న పంట పొలాలను లాక్కోవడం సరైంది కాదన్నారు. రైతులు పెద్ద పెత్తున తరలి రావాలన్నారు.

పనిగంటల విధానం అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, శ్రీనివాస్ మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానాన్ని కచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, రాములు, ఎల్లప్ప, అనంతయ్య, భీమమ్మ, సాయమ్మ, సరస్వతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్ కలెక్టరు ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయని ఆయన తెలిపారు.

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మరో అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. మొత్తం 115 అర్జీలను స్వీకరించామన్నారు. వీటిలో రెవెన్యూ తదితరాలకు చెందినవి ఉన్నాయన్నారు. కొన్నింటిని వెంటనే పరిష్కరించామన్నారు. పరిష్కారం చూపని వాటి విషయంలో అర్జీదారులకు అధికారులు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ప్రగతి పనులపై ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న గౌతమ్, కలెక్టర్ ప్రతీక్, అధికారులు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మున్సిపాలిటీని కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గౌతమ్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనలో భాగంగా ఆటోలకు జీపీఎం విధానాన్ని పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం జంతు (శునకాలు) జనన నియంత్రణ కేంద్రాన్ని చూసి ఎన్నింటికి కు.ని చేశారని అడగ్గా 28కి చేసినట్లు కమిషనర్ వెంకటయ్య బదులిచ్చారు. చెత్తదిబ్బ పనులను అడగ్గా కలెక్టర్ నాలుగు ఎకరాలు కేటాయించారని త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ అశోక్‌కుమార్, పురపాలక డీఈఈ రాకేష్, మేనేజర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సీడీఎంఏ అధికారి వీపీ గౌతమ్ సోమవారం కడా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సతీష్ జైన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్‌లోని అంబేడ్కర్ కూడలి, లాహోటీ కాలనీలోని పార్కు పాత కొడంగల్ ప్రాంతంలో నిర్మించే సమీకృత గురుకుల భవనాల స్థలాలను పరిశీలించారు. పార్కులు, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించే విషయమై ఆరా తీశారు. కార్యక్రమంలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి: సీపీఎం



మాట్లాడుతున్న వెంకట్రాములు

పరిగి, న్యూస్‌టుడే: అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారని, ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములు, జగదీష్ డిమాండ్ చేశారు. సోమవారం పరిగిలో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఆరు హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాటిని అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ ఎం.వెంకటయ్య, జిల్లా నాయకులు ఆర్.మహిపాల్, సతీష్, నర్సమ్మ, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. వెలవెల



కార్యక్రమంలో.. ఎంపీడీఓ, ఇతర అధికారులు

వికారాబాద్ గ్రామీణ: ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కావడం లేదనో, అధికారుల లోపమో తెలియదుకానీ సోమవారం ప్రజావాణికి దరఖాస్తులు కరవయ్యాయి. మూడు వారాలుగా వికారాబాద్ మండల కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న ప్రజావాణికి దరఖాస్తులు రావడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎవరూ రాకపోవడంతో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఇతర అధికారులు వెళ్లిపోయారు.

ఐదేళ్లు గడిచినా.. పిల్లర్లు దాటలే..



ధారూర్: ప్రజోపయోగ నిర్మాణాలు సకాలంలో పూర్తయితేనే లక్ష్యం నెరవేరేది. ఏళ్లుగడిస్తే ప్రజాధనం వృథా అవుతుంది. ఇందుకు ధారూర్ మండల కేంద్రంలో చేపటిన అతిథి గృహ నిర్మాణం ఉదాహరణగా నిలుస్తోంది. దీని నిర్మాణం కోసం 2018లో రూ.10 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు చేపట్టిన గుత్తేదారు పునాదుల వరకు పూర్తి చేసి వదిలేశారు. దీంతో వర్షాలు కురిస్తే నీటితో నిండి కొలనుగా మారుతోంది. ఏడాదిలో పూర్తి కావలసిన పనులు ఐదేళ్లు గడుస్తున్నా ఇంకా పిల్లర్లకే పరిమితం అయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సంవత్సరాల పాటు కొనసాగితే ఎప్పుడు వినియోగంలోకి వస్తాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తి అతిథి గృహం పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ యంత్రం.. ఆకర్షణీయం

పూడూరు మండలం, మన్నెగూడ నుంచి హైదరాబాద్‌కు బీజాపూర్ రహదారిపై సోమవారం భారీ వాహనంలో పెద్ద యంత్రాన్ని తరలించారు. దీనిని చూసేందుకు వాహనదారులే కాదు, స్థానికులు సైతం ఉత్సాహం చూపారు. దీంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కర్ణాటక రాష్ట్రంలో ఇలాంటి యంత్రాలను తయారుచేసి లింక్ రోడ్లపై పట్టణ ప్రాంతాలకు తరలిస్తారని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, పూడూరు.



107 కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ మున్సిపాలిటీ: జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ మొత్తం 107 కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. ఐకేపీ 21, పీఏసీఎస్ 62, డీసీఎంఎస్ 22, ఎఫ్‌పీఓ-2 ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో లక్ష 30 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని తెలిపారు. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, డీఎం విజయలక్ష్మి, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి పాల్గొన్నారు.

రూ.48 కోట్లు పోశారు..

గుంతలు మిగిల్చారు

5 ఏళ్లకే తాండూరు-సంగారెడ్డి మార్గం అధ్వానం



పెద్దేముల్- బుద్దారం మధ్య ప్రమాదకర గుంత

న్యూస్‌టుడే, పెద్దేముల్: జాతీయ రహదారి 65కు అనుసంధానంగా రూ.48 కోట్ల వ్యయంతో నిర్మించిన తాండూరు-సంగారెడ్డి రోడ్డు మార్గం నాణ్యత లోపంతో అడుగడుగునా గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వానకు రోడ్డు మరింత ధ్వంసమైంది. గుంతలు పడిన చోట మట్టితో మరమ్మతులు చేసి మమ అనిపిస్తున్నారు.

రెండు వరుసల రహదారిగా మారినా

తాండూరు నుంచి మోమిన్‌పేట శివారు మొరంగపల్లి వరకు గల సింగిల్ రోడ్డును రెండు వరుసల రహదారిగా మార్చేందుకు 2016లో అప్పటి ప్రభుత్వం రూ.48 కోట్లు మంజూరు చేసింది. 38 కిలో మీటర్ల దూరం గల రోడ్డు మార్గాన్ని మూడు విభాగాలుగా విభజించి పనులు గుత్తేదార్లకు అప్పగించారు. మొదటి విడతగా తాండూరు శివారు అంతారం నుంచి పెద్దేముల్ వరకు గల 10 కిలో మీటర్ల రోడ్డును రెండు వరుసల రోడ్డుగా మార్చారు. ఆ తర్వాత పెద్దేముల్ నుంచి కోట్‌పల్లి, కోట్‌పల్లి నుంచి మొరంగపల్లి వరకు మూడేళ్లలో పనులు పూర్తి చేశారు. రోడ్డు బాగు కావడంతో వాహనాల రాకపోకల సంఖ్య విపరీతంగా పెరిగింది. 60 నుంచి 70 టన్నుల సామర్థ్యం గల వాహనాలు సరుకు రవాణా చేస్తున్నాయి.



కందనెల్లి తండా వద్ద రోడ్డు ఇలా..

కనీస మరమ్మతులు కరవు

రోజు వేల సంఖ్యలో వాహన రాకపోకలు ఈ మార్గంలో సాగుతాయి. తాండూరు శివారులోని సిమెంటు పరిశ్రమలు, నాపరాయి పరిశ్రమల నుంచి రోజూ లారీలు వందల సంఖ్యలో సరకు రవాణా చేస్తున్నాయి. సంగారెడ్డి, సిద్దిపేట్, కరీంనగర్, హైదరాబాద్, జోగిపేట, పుణె తదితర ప్రాంతాలకు ఇదే మార్గంలో సరకు రవాణా జరుగుతోంది. కొత్తగూడెం నుంచి సిమెంటు పరిశ్రమలకు అవసరమైన ముడి సరకు బొగ్గు తాండూరుకు రవాణ అవుతోంది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డంతా గుంతలు పడి ఇబ్బందులు తప్పడం లేదు.

● ఈ రోడ్డు మార్గానికి ఐదేళ్లుగా కనీస మరమ్మతులు కరవయ్యాయి. గుంతలు పడ్డ చోట మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడం నరకాన్ని తలపిస్తోంది. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఐదేళ్లు గడుస్తున్నా మరమ్మతుల కోసం నిధులు మంజూరు కాలేదు. రోడ్డు పరిస్థితి తెలియని వారు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం: శివకుమార్, డీఈఈ, ఆర్ అండ్ బీ, తాండూరు

తాండూరు నుంచి కోట్‌పల్లి వరకు గల రోడ్డు చాలా చోట్ల ధ్వంసమైంది. వర్షాలకు రోడ్డు బాగా దెబ్బతింది. మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు మొదలుపెడతాం.

మక్కలకు అధరహో..!

మార్కెట్లో మద్దతుకు మించి పలుకుతున్న తీరు

ఇవీ వివరాలు..

- జిల్లాలో సాగు విస్తీర్ణం: 85 వేల ఎకరాలు
- ఎకరాకు దిగుబడి: 20 క్వింటాళ్లు
- ప్రభుత్వ మద్దతు ధర: రూ.2,090
- బహిరంగ విపణిలో ధర: రూ.2,150 నుంచి 2,450



పొలం దగ్గర మక్కలు ఆరబెడుతున్న రైతులు

న్యూస్‌టుడే, వికారాబాద్, వికారాబాద్ మున్సిపాలిటీ, ధారూర్, వికారాబాద్ గ్రామీణ: భారీ వర్షాలతో నష్టం వాటిల్లి దిగుబడులు తగ్గినా, బహిరంగ విపణిలో మక్కలకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు ఒకింత ఊరట కలుగుతోంది. జిల్లాలో పంట నూర్పిళ్లు జోరుగా కొనసాగుతూ, ఇప్పుడిప్పుడే మక్కలు విపణికి వస్తున్నాయి. సోమవారం వికారాబాద్ వ్యవసాయ విపణికి 250 క్వింటాళ్ల మక్కలు వచ్చాయి. ప్రభుత్వ మద్దతు ధర కంటే మించి బహిరంగ విపణిలో అధిక ధర పలుకుతోంది. దీంతో రైతులకు కలిసి వస్తోంది.

గతంలో నష్టాల పాలు

మక్కలకు ధర లేకపోవడంతో మొక్కజొన్న సాగు చేపట్టకూడదని 2020లో అధికారులు తేల్చి చెప్పారు. అప్పట్లో బహిరంగ విపణిలో మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాలుకు రూ.1,200 నుంచి రూ.1,300 వరకు మాత్రమే పలికింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర రూ.1,870 కొనుగోలు చేయడంతో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లింది. మొక్కజొన్న సాగు చేయవద్దని అధికారులు ప్రచారం చేసినా కొంతమంది రైతులు సాగు చేపట్టి 2021లో నష్టపోయారు.

నల్ల, ఎర్రరేగడి నేలల్లో ఆశాజనకం: 2022 నుంచి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ఉంటుందని భావించిన రైతులకు అధిక ధర దక్కుతుండటంతో సాగు విస్తీర్ణం ఏయేటికాయేడు పెరుగుతోంది. మొక్కజొన్న సాధారణ దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లు కాగా, తీవ్ర అతివృష్టి పరిస్థితులతో దిగుబడి ఎకరాకు సగటున 15 క్వింటాళ్లకు పడిపోయింది. వర్షాలకు నీరు నిలిచే ఇసుక, చెల్క, చవుడు భూముల్లో సాగు చేసిన మక్కలకు తీవ్ర నష్టం వాటిల్లి దిగుబడులు సగానికి పైగా తగ్గిపోగా, నల్ల, ఎర్రరేగడి పొలాల్లో మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి. వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాల్లో వరికి బదులుగా మొక్కజొన్నను ఆరు తడి పంటగా సాగు చేశారు. డిమాండ్ ఉండటంతో రానున్న రోజుల్లో మక్కల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

లాభాలు వస్తాయి



రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రూ.25 వేల పెట్టుబడి పెట్టా. నూర్పిడి చేస్తున్నాం. అధిక వర్షాలకు దిగుబడులు తగ్గి ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున రావొచ్చని భావిస్తున్నా. బహిరంగ విపణిలో ధర ఆశాజనకంగా ఉండటంతో లాభాలు వస్తాయి. – లక్ష్మణ్‌నాయక్, కొటాలగూడ, వికారాబాద్.

వీధి శునకాలకు కు.ని.శస్త్ర చికిత్సలు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు పట్టణంలో వీధి శునకాల సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్ర చికిత్సలు ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణ వ్యాప్తంగా ఆదివారం కొన్ని శునకాలను పట్టుకున్నారు. వీటిని పట్టణ శివారులోని చెత్త డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసి శునకాల సంరక్షణ కేంద్రంలో సోమవారం ఐదుగురు పశు వైద్యుల బృందం ఆధ్వర్యంలో 8 శస్త్ర చికిత్సలు నిర్వహించారు. చికిత్సలు చేసిన ఐదు రోజుల తర్వాత వాటిని మళ్లీ వదిలేస్తారు. ఈ ప్రక్రియను పురపాలక సంఘం అధ్యక్షురాలు స్వప్న, కమిషనరు విక్రమ సింహారెడ్డి పర్యవేక్షించారు. శునకాల బెడద నివారణకు సహకరించాలన్నారు.

అదనులో సాగు.. దిగుబడి బాగు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్



చిక్కుడు సాగుకు చల్లని వాతావరణం అవసరం. శీతాకాలం పంటగా ప్రస్తుత తరుణంలో సాగు చేయాలని చెబుతున్నారు సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారిణి సునీత. శీతాకాలం పంటగా అక్టోబరు-నవంబరు మాసాలలో సాగు చేయాలి. ఈ పంట అధిక ఉష్ణోగ్రత, అధిక వర్షపాతాన్ని, అధిక మంచును తట్టుకోలేదు.

అనుకూలమైన రకాలు: తీగ రకం: కెంటకీ వండర్, టీకేడీ-1. **పొది రకం:** కంటెండర్, అర్కకోమల్, అర్కసువిధ **నేలలు..:** ఇసుకతో కూడిన ఎర్ర గరప, ఒండ్రు నేలలు, నీటి వసతి ఉన్న బరువైన నేలలు అనుకూలం. ఉదజని సూచిక 5-3-6 ఉన్నవి అనుకూలం.

చీడపీడల నివారణ..

ఈ పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 300 గ్రా. లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- పేనుబంక తెగులు ఆశిస్తే మిథైల్ డిమెటాన్ 400 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.
- భూమిలో తేమ అధికంగా ఉంటే వేరుకుళ్లు తెగులు ఆశిస్తుంది. లేతమొక్కలు చనిపోతాయి. 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి లేదా 3 గ్రా. థైరామ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు సీఓసీ 3 గ్రా. లేదా మాంకోజెబ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

విత్తనాలు, ఎరువులు..

- తీగ రకాలైతే ఎకరానికి 10-12 కిలోలు, పొద రకం ఎకరానికి 20-24 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. పొలంలో విత్తే ముందు 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ వినియోగించి కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలి.
- దుక్కి దున్ని 30-35 సెం.మీ. దూరంలో బోదెలు వేసుకోవాలి. ఒక్కో వరుసలో 25-30 సెం.మీ. దూరంలో విత్తనాలు నాటాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 10 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ చల్లితే ప్రయోజనంగా ఉంటుంది.

నీటి తడులు..

పూత దశలో ఎకరానికి 10 కిలోల నత్రజనిచ్చే ఎరువులు వేయాలి. అనంతరం నీటి తడులు అందించాలి. నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. పూత దశలో తేమ ఎక్కువ, తక్కువ కాకుండా చూసుకోవాలి. సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. తీగ రకాలైతే ఎకరానికి 5-6 టన్నులు, పొదరకం 3-4.5 టన్నుల వరకు వస్తుంది.

రైతేరాజు

సాగులో సందేహాలా?
సంప్రదించాల్సిన ఫోన్ నం: **93815 15588**

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: వరిలో ఆకులపై పసుపు రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. నివారణ చర్యలు తెలపండి? – **గోవర్ధన్, తాండూరు**

సమాధానం: ఎండాకు తెగులు సోకితే ఇలాగే జరుగుతుంది. వెంటనే పై పాటుగా నత్రజని ఎరువు వేస్తే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, చేర్యాల

వేరుసెనగలో సస్యరక్షణ కీలకం

నూనె గింజల పంటల సాగులో ప్రధానమైన వేరుసెనగలో సస్యరక్షణ పక్కాగా చేపడితే అధిక దిగుబడి సాధ్యం. ప్రస్తుత యాసంగిలో అత్యధికులు ఈ పంట సాగు చేస్తున్నారు. సెప్టెంబరులో పలువురు దీన్ని పండిస్తున్నారు. ఇప్పటికే మొలకలు వచ్చాయి. ప్రస్తుతం ఆకుముడత, పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. ఆకు ముడత నివారణకు లీటరు నీటికి నొవాల్యురాన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 5 మి.లీ. వేపనూనె లేదంటే 2 మి.లీ.క్వినాల్‌ఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

మెరుగైన సేవలు.. దరిచేరిన పురస్కారాలు

మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం కాయకల్ప పురస్కారాలు అందిస్తోంది. 2023-24 సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి పలు దవాఖానాలు పురస్కారాలకు ఎంపికై ప్రత్యేకతను చాటడం విశేషం.

న్యూస్‌టుడే, తాండూరు టౌన్, గజ్వేల్, గుమ్మడిదల



అందుబాటులో ఉంటూ..

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సైతం కాయకల్ప అవార్డు దక్కింది. ఇక్కడికొచ్చే రోగులను మర్యాదగా పలకరించి వారి బాధ తెలుసుకొని వైద్య సేవలు అందించడం ఇక్కడి వైద్యులు, సిబ్బందికి అలవాటు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ఈ కేంద్రానికి నిత్యం 70 నుంచి 100 మంది వరకు పేషెంట్లు వస్తున్నారు. అవసరమైన వారిని జిల్లా కేంద్రానికి రిఫర్ చేస్తున్నారు. మరోవైపు కేంద్రం పరిధిలో గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటున్నారు. అవార్డు కింద రూ.2 లక్షలు రానున్నాయి. ఈ నగదుతో ఆసుపత్రిలో రోగులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామని వైద్యులు మధుకర్, విజేతలు తెలిపారు.

పారిశుద్ధ్యం నిర్వహణలో భేష్



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి ఇప్పటివరకు మూడుసార్లు వరుసగా కాయకల్ప అవార్డులు దక్కాయి. ఈ సారి ద్వితీయ స్థానంలో నిలిచింది. పరిసరాల పారిశుద్ధ్యం, వైద్య వ్యర్థాల నిర్వహణ, వార్డుల పర్యవేక్షణ తదితర 8 విభాగాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఇందుకు ఎంపికైంది. రూ.40 కోట్లతో 100 పడకల సామర్థ్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. ప్రస్తుతం నెలకు 350 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లల ఐసీయూ, వృద్ధులకు మోకాళ్ల చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సలు సైతం చేస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం పాలియేటివ్ వార్డు, 7 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటయ్యాయి. నెలకు 15 వేల మందికి పైగా ఓపీ, 600 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. పరిసరాలు, ఆవరణ, వార్డులు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. నిత్యం 500 కిలోల సాధారణ వ్యర్థాలను బల్దియా సేకరిస్తుండగా, రెండురోజులకోసారి 500 కిలోల బయో వ్యర్థాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆవరణ మొక్కలతో వనాన్ని తలపిస్తోంది.

ముందంజలో నిలిచి..



ఆసుపత్రిలోని వార్డు

వికారాబాద్ జిల్లా తాండూరులో 20 ఏళ్ల కిందట 200 పడకలతో జిల్లా స్థాయి ఆసుపత్రిని నిర్మించారు. నిత్యం జిల్లా వాసులతో పాటు మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి ప్రజలు ఇక్కడికి వైద్యసేవల నిమిత్తం వస్తుంటారు. రోజూ 800 మందికి పైగా సేవలు పొందుతున్నారు. 100 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. వైద్యులు, సిబ్బంది బాధితుల ఇబ్బందులను తెలుసుకొని అందుకు అనుగుణంగా చికిత్స అందిస్తూ ఉపశమనం కలిగిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు పరిసరాల శుభ్రత తదితర అంశాల్లో ముందంజలో నిలుస్తోంది. తద్వారా రాష్ట్ర స్థాయిలో అవార్డులు దక్కుతున్నాయి. తొలిసారిగా 2021లో కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. 2022లో రెండో సారి, తాజాగా ఈ ఏడాది మూడో సారి అవార్డు దక్కించుకుంది.

- ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో మెరుగ్గా ఉండటంతో రాష్ట్ర స్థాయిలో తొలిస్థానంలో నిలిచింది. కాయకల్ప అవార్డు రూ.25 లక్షలు రానున్నాయి. వీటితో వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించనున్నామని ఆసుపత్రి పర్యవేక్షకుడు శంకర్ తెలిపారు.

సమష్టిగా అడుగేస్తూ.. లాభాలు ఆర్జిస్తూ..



కాకర తోట



మధుసూదన్‌రెడ్డి



లక్ష్మారెడ్డి

సమష్టిగా ముందుకు సాగితే ఏదైనా సాధ్యమే. ఏ రంగంలోనైనా ఇది వర్తిస్తుంది. ఈ సూత్రాన్ని నమ్మిన ఈ అన్నదమ్ములు కలిసి సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వారే నర్సాపూర్ మండలం ఆవంచకు చెందిన మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి. వీరికి పదెకరాల పొలం ఉంది. ఐదెకరాలలో వరి, మిగతా దాంట్లో బీర, సొర, కాకరతో పాటు ఆకుకూరలు పండిస్తున్నారు. మొదట్లో మామూలుగా పండించగా.. ఆ తర్వాత పందిరి సాగు విధానాన్ని పాటిస్తున్నారు. కడీలు పాతించి తీగలు అల్లించారు. అంతర పంటగా ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

నీటిని నిల్వ చేసుకొని..

పంటలకు అవసరమైన మేర నీటి తడులు అందించాలన్న ఉద్దేశంతో పొలంలో నిల్వ గుంత తవ్వించారు. అందులోకి వాన నీరంతా చేరేలా ఏర్పాట్లుచేశారు. బోరు నీటిని సైతం అందులోకి పారిస్తారు. అందులోనే సేంద్రియ ఎరువులు కలిపి బిందు పరికరాల ద్వారా కూరగాయల మొక్కలకు పారేలా చేస్తున్నారు. ఈ విధానంలో సమయం ఆదా కావడంతో అవసరం మేర మాత్రమే నీటిని వాడుతున్నారు. ఒకే పంట కాకుండా పలు రకాలవి సాగు చేయడం అంతగా నష్టం వాటిల్లదు. మూడు నెలల్లో ఆయా రకాలు 300 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. విత్తనాలు, ఎరువులు తదితర వాటికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడులను నర్సాపూర్, హత్నూర మండలం దౌల్తాబాద్, జిన్నారం మార్కెట్లలో విక్రయిస్తున్నారు. రూ.3 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోగా రూ.1.50 లక్షల వరకు లాభం మిగులుతోంది. మరోవైపు వరితో రూ.3 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. ఆకుకూరలతో రూ.50 వేల వరకు వస్తున్నాయి.

– న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్

పత్తిలో వేరుకుళ్లు తెగులా..

పత్తిలో వేరుకుళ్లు తెగులు అధిక తేమ శాతం కారణంగా ఆశిస్తుంది. దీని నివారణలో నిర్లక్ష్యం చేస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా.కార్బెండాజిమ్ కలిపిన ద్రావణాన్ని మొక్కల పాదుల చుట్టూ పిచికారీ చేయాలి. వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు ఇలా చేస్తే తెగులు నివారణ సులభమే.



- న్యూస్‌టుడే, చేర్యాల

పద్య సాహిత్యం సమాజానికి అవసరం



ట్రెండింగ్ పద్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పద్య సాహిత్యం సమాజానికి ఎంతో అవసరమని అవధాని, పద్యసారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అవుసుల భానుప్రకాశ్ అన్నారు. పద్యం ద్వారానే బాలలు నీతి నిజాయతీ, న్యాయం నేర్చుకుంటారన్నారు. ఆయన రచించిన 'ట్రెండింగ్ పద్యాలు' పుస్తక పరిచయ సభ సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మాట్లాడారు. బాలల నుంచి యువత, వృద్ధుల వరకు చదివే పుస్తకం ట్రెండింగ్ పద్యాలు అని అన్నారు. కవి ఐతా చంద్రయ్య మాట్లాడుతూ సంప్రదాయాలకు అనుగుణంగా సాహిత్య రచనలు ఉండాలన్నారు. మరో కవి కొమురవెల్లి అంజయ్య మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రచనలు రావాలన్నారు. కార్యక్రమంలో గోగులపాటి కృష్ణమోహన్, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, సింగీతం నరసింహారావు, సరస్వతీ రామశర్మ, బస్వ రాజ్‌కుమార్, కాంతికృష్ణ, నాగలత, యాదగిరి, మహేందర్ రెడ్డి, బాలచంద్రం, అంజిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సుడోకు పోటీలకు జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి

జహీరాబాద్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన భాజపా నాయకుడు, మెదక్ డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఆయన తనయుడు కార్తీక్‌రెడ్డి ప్రపంచ సుడోకు, పజిల్ పోటీలకు ఎంపికయ్యారు. చైనా బీజింగ్‌లో ఈ నెల 14 నుంచి వారం పోటీలు జరగనున్నాయి. లాజిక్ మాస్టర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏడాది పాటు ఆన్‌లైన్ ద్వారా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని 50 మందిని గుర్తించి, వీరికి గత ఆగస్టు 10,11 తేదీల్లో బెంగళూరులో పోటీలు నిర్వహించి నలుగురు ఎంపిక చేయగా, అందులో జహీరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు ఉండటం విశేషం.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

మనోవేదనతో వృద్ధుడు..

రామాయంపేట: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట ఎస్‌ఐ పుట్టి స్వామి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన పుట్టి స్వామి (58) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడు. స్థానిక కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అన్ని చోట్ల వెతకగా సోమవారం స్థానిక చెరువులో మృతదేహం కనిపించింది. కుమారుడు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్యాన్సర్ తగ్గక వృద్ధుడు..



నాగయ్య

మనోహరాబాద్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మనోహరాబాద్‌కు చెందిన తూం నాగయ్య(60) ఇంట్లోనే ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. నాగయ్య కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండేళ్లుగా పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా తగ్గలేదు. ఈ నెల 4న ఇంట్లో ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన అతడి భార్య ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం మత్తులో యువకుడు..



రాకేష్

బెజ్జంకి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని దాచారానికి చెందిన చెందిన బొర్ర రాజు, సరవ్వ చిన్న కుమారుడు రాకేష్ (20) పదో తరగతి వరకు చదివి మానేశాడు. కూలీ పనులతో పాటు హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆదివారం రాత్రి భోజనం చేశాక పడక గదిలోకి వెళ్లాడు. వెంటిలేటర్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించగా.. కుటుంబీకులు గమనించి కిందికి దించి సీపీఆర్ చేశారు. అప్పుడే చేరుకున్న 108 వాహన సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తేల్చిచెప్పారు. ఇంటికొచ్చిన కొడుకు అరగంట వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో కుటుంబీకులు బోరున విలపించారు. సోమవారం కేసు నమోదైంది.

ఫుట్‌బాల్ ఫైనల్‌కు రంగారెడ్డి జట్టు



పోటీలు ప్రారంభిస్తున్న మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మెదక్‌లో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, పోటీల కోఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో రెండో రోజు సోమవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 10 జట్లు పాల్గొనగా, రెండు గ్రూప్‌లుగా విభజించి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. లీగ్ దశలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్-రంగారెడ్డి జట్ల మధ్య జరిగింది. ఇందులో రంగారెడ్డి జట్టు ఫైనల్‌కు వెళ్లింది. మరో సెమీఫైనల్ పోటీ మంగళవారం మెదక్, ఆదిలాబాద్ జట్ల మధ్య జరగనుంది. ఇందులో గెలుపొందిన జట్టు రంగారెడ్డితో ఫైనల్‌లో ఆడనుంది. రెండో రోజు పోటీలను మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ప్రారంభించారు. పోటీలకు సినీ నిర్మాత సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, సిద్దార్థ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరిలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు మాధవరెడ్డి, చంద్రమోహన్, శ్యామయ్య, రాజేందర్, సత్యం, దేవేందర్‌రెడ్డి, రవి, పద్మ, సరోజిని, మహిపాల్ తదితరులు ఉన్నారు.

ఆగిన కుంచె.. మూగపోయిన కంఠం




నర్సింలు

వికారాబాద్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడు నర్సింలు మృతితో చిత్రాలకు జీవం పోసే కుంచె ఆగిపోయింది. సమాజాన్ని చైతన్యపరిచే కలం నుంచి జాలువారిన గీతాలు, ఆలపించిన కంఠం మూగపోయింది. వికారాబాద్ పుర పరిధి గిరిగిట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మర్పల్లి మండలం కల్కోడకు చెందిన నర్సింలు (50) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడే అయినా ప్రవృత్తిలో చిత్రకళాకారుడిగా, గాయకుడుగా, పాటల రచయితగా అందరికీ సుపరిచితుడు. సమాజాన్ని మేల్కొలిపే బాలల హక్కులు, మూఢనమ్మకాలు, అక్షరాస్యత, తెలంగాణ ఉద్యమంపై ఎన్నో పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. ఎంతో మందికి చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు. ఆయన మృతికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్‌లో భాగంగా ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్లస్టర్ స్థాయి బృందగానం పోటీల్లో ప్రథమ, బృందనృత్యంలో ద్వితీయ స్థానంలో నిలిచారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించే రీజినల్ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల జాబితాలో అళగర్ స్వామికి చోటు



సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, న్యూస్‌టుడే: సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అళగర్ స్వామి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రపంచ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ విశ్వవిద్యాలయం సెప్టెంబరు 15న జాబితా ప్రకటించగా.. కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఎన్.రాజు మాట్లాడుతూ.. అళగర్ స్వామి యాంటీ వైరల్ మెడిసిన్స్ ఫార్మసీలో పరిశోధన చేసినందుకు ప్రపంచ ర్యాంకింగ్‌లో స్థానం దక్కినట్లు పేర్కొన్నారు. 2020 నుంచి ఈ ఏడాది వరకు వరుసగా అయిదు సార్లు జాబితాలో చోటు కల్పించారని, ర్యాంకింగ్స్‌లో తెలంగాణలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. గ్లోబల్ ర్యాంకు 1,48,458, పరిశోధనల్లో 1,795 ర్యాంకు సాధించారన్నారు. ఆయన పలు రకాల పుస్తకాలు రాసి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ రవివర్మ తదితరులు అళగర్ స్వామిని అభినందించారు.



బతుకమ్మ సంబురం.. ఆనందం అంబురం

తాండూరు పట్టణంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. శాంతినగర్ కాలనీలోని మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాటలు పాడుతూ కోలాటం, దాండియా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని కాగ్న నదిలో నిమజ్జనం చేశామని స్నేహ బృందం ప్రతినిధి అనురాధ తెలిపారు. **- న్యూస్‌టుడే, పాత తాండూరు**

బావిలో పడి మహిళ మృత్యువాత

రామాయంపేట: ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన ఓ మహిళ మృతి చెందింది. రామాయంపేట ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలు.. లక్ష్మాపూర్‌కు చెందిన కాసుల నాగవ్వ (53) ఆదివారం రాత్రి తమ పొలానికి వెళ్లింది. అడవి పందుల నుంచి కాపలాకు బ్యాటరీ లైట్‌తో పొలంలో తిరుగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయింది. సోమవారం ఉదయం కుమారుడు దుర్గరాజు పొలానికి వెళ్లగా తల్లి నాగవ్వ కనిపించలేదు. బావి గట్టుపై చెప్పులు, బ్యాటరీ పడి ఉన్నాయి. అందులో వెతకగా నాగవ్వ మృతదేహం లభ్యమైంది. దుర్గరాజు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చేపల వేటకు వెళ్లి యువకుడు..



యాదగిరి

పాపన్నపేట: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన రొడ్డ యాదగిరి(31) రైతు. సోమవారం పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 114–00	డ్రెస్డ్ 197–00	
రిటైల్ 136–00	స్కిన్‌లెస్ 224–00	

సాగు పెరిగేలా.. అవగాహన పెంపెందించేలా..

● నేడు ఎఫ్ఆర్ఎస్‌లో డ్రాగన్ ఫ్రూట్ మేళా

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్



డ్రాగన్ ఫ్రూట్



పూత దశలో

డ్రాగన్ ఫ్రూట్‌లో ఆరోగ్యానికి మేలు చేసే గుణాలెన్నో ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఈ ఫలాలకు డిమాండ్ పెరిగింది. డ్రాగన్ పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు సైతం లాభాలు అదే స్థాయిలోనే ఉంటున్నాయి. అయితే సరైన అవగాహన లేక దీని సాగు అంతంతే ఉంది. అత్యధిక మంది రైతులు వెనుకడుగే వేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో సంగారెడ్డిలోని ఫల పరిశోధనా స్థానం అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డ్రాగన్ ఫ్రూట్ మేళాను మంగళవారం నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న పరిశోధనలు..

సంగారెడ్డిలోని కొండా లక్ష్మణ్ ఫల పరిశోధనా స్థానం (ఎఫ్ఆర్ఎస్)లో డ్రాగన్ ఫ్రూట్‌పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇందుకు ప్రత్యేక బ్లాక్ ఏర్పాటుచేసి వివిధ రకాల మొక్కలను నాటి పెంచారు. ఇటీవలే ఫలసాయం సైతం వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు ఇక్కడి నేలలు అనుకూలమని తమ పరిశోధనల్లో ఇక్కడి శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో 142 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొండాపూర్, నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి మండలాల్లో సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణం పెంపు లక్ష్యంగా మేళాను నిర్వహిస్తున్నారు.



డ్రాగన్ ఫ్రూట్ తోట

అభ్యుదయ రైతులు.. ఔత్సాహికులు

మేళాలో డ్రాగన్ ఫ్రూట్‌కు చెందిన పలు రకాలను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే దీన్ని సాగు చేస్తున్న రైతులతో పాటు ఈ పంట సాగుపై ఆసక్తి ఉన్న వారినీ మేళాకు ఆహ్వానించారు. ఈ పంట సాగుతో ఉన్న ప్రయోజనాలు, ప్రతికూలతలను అభ్యుదయ రైతులు వివరిస్తారు. ఎదురయ్యే ఇబ్బందులు, ఎలా అధిగమించాలన్న అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించనున్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా మెరుగ్గా ఉన్న నేపథ్యంలో దీని సాగుకు ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన శాఖ సంచాలకురాలు యాస్మిన్ భాషా, విశ్వవిద్యాలయం ఉప కులపతి నీరజ ప్రభాకర్, ఎఫ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర తదితరులు పాల్గొని పలు అంశాలను వివరించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



సంతోష్

మనోహరాబాద్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మేడోజీ సంతోష్‌చారి(36) ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి పుట్టినరోజు వేడుకలకు దండుపల్లి వెళ్లి తిరిగి బయల్దేరాడు. దండుపల్లి చౌరస్తా వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం సంతోష్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరొకరు..



సాయిలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. కొత్తలింగాయిపల్లి గ్రామానికి చెందిన కొల్కూరి సాయిలు(48) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పండగ నిమిత్తం సోమవారం తన ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి ఇంటికి బయలుదేరాడు. మల్లంపేట గ్రామ శివారులోని మలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తల, శరీరానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు కూతురు, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే

పరిగి: పార్టీ కార్యకర్తల సంక్షేమం ముఖ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు, తన కుమారుడు రితి కొరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం పరిగిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి రితి కొరెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

వికారాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి 69మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రజకులకు అధిక స్థానాలు కేటాయించాలి

పూడూరు, న్యూస్‌టుడే: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు ఎక్కువ స్థానాలు కేటాయించి పోటీ చేసేందుకు అవకాశం కల్పించి మద్దతు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. సోమవారం పూడూరులో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి, వార్డులకు జరిగే ఎన్నికల్లో ముందుకు వచ్చి సత్తా చాటాలన్నారు. నాయకులు అశోక్, వీరన్న, మల్లేష్, బుచ్చన్న తదితరులున్నారు.

రోడ్డు పక్క బావులు.. ప్రమాదాలకు నిలయాలు

న్యూస్‌టుడే, కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్: చలికాలం ప్రారంభం కావడంతో తెల్లవారుజామున పొగ మంచుతో రహదారి కనిపించకుండా పోతుంది. ఎదురుగా వస్తున్న వాహనాలు గుర్తించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా రోడ్డు పక్కన బావులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. లారీలు, బస్సులు, ఇతర వాహనాలు లైట్లు వేయడంతో కళ్లకు వెలుతురు అధికంగా పడి ఎదురుగా ఏ వాహనం వస్తుందో గుర్తు తెలియడం లేదు. ఒక్కసారిగా దగ్గరకు రాగానే బ్రేకులు వేయడంతో ఢీకొని రోడ్డు ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. సంబంధిత అధికారులు రహదారి పక్కన బావులు, గుంతలను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కొడంగల్: రోడ్డు పక్కన బావి

పలుచోట్ల పరిస్థితి: బొంరాస్‌పేట మండలం నాజాఖాన్‌పల్లి సమీపంలో రోడ్డు పక్కన రెండు బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో ఈ బావుల్లో పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనం కనిపించక బావిలోకి దూసుకుపోయాయి. నాగిరెడ్డి గ్రామం వద్ద ఇదే కారణంతో ఆటో లారీ ఢీకొని ముగ్గురు మృత్యువాత పడ్డారు. కొడంగల్ మండలం గుండ్లకుంట నుంచి దౌల్తాబాద్ వెళ్లే మార్గంలో నాలుగు బావులు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. గతంలో ఓ ట్రాక్టర్ బావిలో పడింది. కల్వర్టులకు సైతం రక్షణ హద్దు దిమ్మెలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

● దౌల్తాబాద్ మండలంలో అంతారం గ్రామ సమీపంలో వాగు దగ్గర మట్టి కోసుకుపోయి కల్వర్టు మధ్యలో పెద్ద గొయ్యి పడిందన్నారు. కర్ణాటక రాష్ట్రం యానగుంది, గుర్మిట్కాల్ ప్రాంతాల నుంచి, మండలం నుంచి కర్ణాటక ప్రాంతానికి ఈ గ్రామం మీదుగా వెళుతుంటారు. చింతల్ చెరువుకట్టపై బీటీరోడ్డు అంచున గొయ్యి ఏర్పడింది. సమీపంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. చెరువుకట్టపై ఒకే వరుస తారురోడ్డు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇచ్చినా గుంతలో పడే ప్రమాదం ఉంది. మున్సిపల్ పరిధి కొండారెడ్డి గ్రామానికి వెళ్లే దారిలో రెండు బావులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మొత్తం మలుపులు తిరిగి ఉంది. పైగా చెట్లు, పొదలతో మధ్య బావులు కనిపించడం లేదు. గతంలో పశువులు బావుల్లో పడి ప్రమాదాలకు గురయ్యాయి.

బావులను పూడ్చివేయిస్తాం: రవికిరణ్, పీఆర్ ఏఈ, కొడంగల్

రహదారుల పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులను వీలైనంత త్వరగా పూడ్చేందుకు ప్రయత్నిస్తాం. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్లకు ఇప్పటికే పనులు ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ వారు సైతం పనులు చేస్తున్నారు. బావుల పూడ్చేందుకు అవకాశం లేకుంటే, రక్షణగా కంచె ఏర్పాటు చేయించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి: 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పరిగి, తాండూరు టౌన్, దౌల్తాబాద్, ధారూర్

? పరిగి టీచర్స్ కాలనీలో హనుమాన్ ఆలయం దాటిన తరువాత గత వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో అంధకారం నెలకొంది. కొత్తవి ఏర్పాటు చేయాలి. – ఉపాసాని, టీచర్స్ కాలనీ

✓ ఇటీవల వాటిని బాగు చేయించాం. వర్షాల కారణంగా వెలగడం లేదు. సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. – వెంకటయ్య, కమిషనర్, మున్సిపాలిటీ

? తాండూరు పురపాలిక పరిధి వెంకటేశ్వరనగర్ కాలనీ వీధుల్లో చెత్త కుప్పలు పూర్తిస్థాయిలో తొలగించడం లేదు. ఇబ్బందిగా ఉంది, సమస్య పరిష్కరించాలి. – గోపాల్, తాండూరు

✓ వెంకటేశ్వరనగర్ కాలనీలో చెత్తకుప్పలు తొలగించి ఇబ్బందుల లేకుండా చూస్తాం. – విక్రమ సింహారెడ్డి, పురపాలిక కమిషనర్, తాండూరు

? దౌల్తాబాద్ మండలం నీటూరులో పురాతన కట్టడం బురుజు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. – రవి, నీటూరు

✓ ఇలాంటి నిర్మాణాలను పరిశీలించి గ్రామస్థుల సూచనలతో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఎంపీడీవో, దౌల్తాబాద్

? ధారూర్ మండలం చింతకుంట గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. – రాజు, చింతకుంట

సమాధానం: పరిశీలించి రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – ప్రణీత్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, ధారూర్

రహదారిపై నూర్పిళ్లు



కుల్కచర్ల, న్యూస్‌టుడే: జొన్న, రాగులు తదితర పంటలు చేతికి వస్తున్న వేళ పలుచోట్ల రైతులు పంటను రహదారిపై ఆరబోస్తున్నారు. వాహనాల రాకపోకలతో కంకుల నూర్పిడి చేస్తున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు వాటిని గుర్తించగా వేగంగా వెళితే ప్రమాదం పొంచి ఉంది. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారికి ముప్పు తప్పకుంది. సంబంధిత అధికారులు రహదారులపై పంట నూర్పిడిలకు అడ్డుకట్టవేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులు షురూ..

పూడూరు, న్యూస్‌టుడే: కండ్లపల్లి గేటు నుంచి గ్రామం వరకు రీబీటీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో గత ఏడాది రీబీటీ కోసం పంచాయతీరాజ్ ద్వారా నిధులు మంజూరు కావడంతో గుత్తేదారు రోడ్డును తవ్వేసి కంకర పరిచారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు రావటంతో జాప్యం జరిగింది.



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో ఇటీవల తిరిగి పనులు ప్రారంభించారు. కంకరను తొక్కించడంతో పాటు గుంతలు పూడ్చుతున్నారు.

బాబోయ్.. గుంతలు



తాండూరు మండలం అల్లాపూర్ దారిలో గుంతలుపడి ప్రమాదకరంగా మారింది. వంతెనకు రెండువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. ప్రతి రోజూ దాదాపు 5వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గోతులతో వాహనదారులు, ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతుల చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ**

గ్యాస్ రాయితీ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న నాయకులు

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి బసిరెడ్డిపల్లి, మాదారం, పేటమాదారం, పోల్కంపల్లి గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు సోమవారం రూ.500కే గ్యాస్ లబ్ధిదారులకు రాయితీ పత్రాలు అందజేశారు. మాజీ సర్పంచి సూరప్ప, గ్రామాధ్యక్షుడు బాగన్న, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పరశురాంరెడ్డి, డీసీసీ నాయకులు శశిధర్‌రెడ్డి, రాంచంద్రయ్య, తావ్ర్యానాయక్, నాయకులు సత్యనారాయణ, శివకుమార్ తదితరులున్నారు.

రాకొండ గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ

దోమ, న్యూస్‌టుడే: సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం దోమ మండలం రాకొండ గ్రామాన్ని సందర్శించారు. ఆదివారం భూ తగాదాలతో ఘర్షణ పడ్డ ఇరువర్గాల వారిని కలిసి క్షేత్రస్థాయిలో సమస్యలపై ఆరా తీశారు. తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేష్‌బాబు, ఎస్సై ఆనంద్‌కుమార్ తదితరులున్నారు.

డైరెక్టర్‌ను అభినందించిన టీఆర్ఆర్

పరిగి: నార్మాక్స్ డైరెక్టర్‌గా ఎన్నికైన దోమ మండలం గూడూరుకు చెందిన ఆగిరాల నర్సింహారెడ్డిని సోమవారం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అభినందించారు. పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం

మర్పల్లి, న్యూస్‌టుడే: బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. బీసీల సమస్యలు, అభివృద్ధికి కృషి చేస్తానని జగన్నాథం తెలిపారు. బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ తదితరులున్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఎన్టీఆర్ ట్రస్టు తోడ్పాటు

పరిగి: పేద విద్యార్థుల ఉన్నతికి తమవంతు సహకారాన్ని అందిస్తామని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.చంద్రయ్య అన్నారు. దోమ మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పిట్ల సాయివంశి ఎన్టీఆర్ ట్రస్టుద్వారా ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుకున్నారు. ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం సాధించడంపై పూలమాలతో సత్కరించారు. తండ్రి నర్సింలు బ్రెయిన్ ట్యూమర్‌తో చనిపోగా ఎన్టీఆర్ ట్రస్టు అండగా నిలిచిందన్నారు.

ట్యాంకు పక్కన మురుగు



బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లిలో మిషన్ భగీరథ నీటి పైపులు మురుగు నీటి నుంచి వెళ్లడంతో తాగునీరు కలుషితమౌతుందని ప్రజలు వాపోతున్నారు. ట్యాంకు వద్ద మురుగు నీటి గుంతను పూడ్చాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, కొడంగల్, బొంరాస్‌పేట**

సంస్కృతికి నిదర్శనం.. బతుకమ్మ సంబురం



వికారాబాద్ మండల కార్యాలయం ఆవరణలో సంబరాలు



మోమిన్‌పేటలో అంగన్‌వాడీ అధికారులు, సిబ్బంది



కుల్కచర్ల: వేడుకల్లో చిన్నారులు, మహిళల సందడి

వికారాబాద్ గ్రామీణ, కుల్కచర్ల, మోమిన్‌పేట, న్యూస్‌టుడే: పండుగలు సంస్కృతికి సాంప్రదాయాలకు నిలయమని ఎంపీపీడీ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండల కార్యాలయం ఆవరణలో ఐకేపీ, ఈసీఎస్, వ్యవసాయ, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, రంగురంగుల బతుకమ్మను తయారు చేసి ఆడిపాడారు. కుల్కచర్లలో మహిళలు బతుకమ్మల సంబురం చేశారు. మోమిన్‌పేటలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరుపుకున్న బతుకమ్మ సంబరాల్లో మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి, మోమిన్‌పేట మండలాల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. సీడీపీవో ప్రవీణ సూపర్‌వైజర్లు రిజ్వాన, పుష్ప, ధనలక్ష్మి తదితరులున్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కుల్కచర్లలో జరిగిన పూజల్లో పాల్గొన్న మహిళలు

వికారాబాద్ మున్సిపాలిటీ, కుల్కచర్ల, న్యూస్‌టుడే: దేవి నవరాత్రులను పురస్కరించుకుని వికారాబాద్ వైభవ లక్ష్మి ఆలయం వద్ద గత ఐదు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు స్కంధమాతదేవిగా దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. మండల కేంద్రం కుల్కచర్లతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, భజన సంకీర్తనలతో గ్రామాల్లో అధ్యాత్మిక వాతావరణ నెలకొంది.



వికారాబాద్‌లో స్కంధ మాతదేవిగా అమ్మవారు

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చలమారెడ్డి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: గ్రామంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈఈ చలమారెడ్డి తాగునీటి సహాయకులకు సూచించారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ పంచాయతీ నీటి సహాయకులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. తాగునీటి సరఫరాలో లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని, నీటి వృథా కాకుండా చూడాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు రత్నప్రసాద్, సువర్చల, ఎంపీవో యాదగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అభిషేక్ తివారి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సాంప్రదాయాలు పెంపొందించుకోవాలి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చిన్నప్పటి నుంచే దేశభక్తి, సమాజం పట్ల అవగాహన, బాధ్యతలను కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ మండల బాధ్యులు రవి, బాలకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధి ఇప్పాయిపల్లి, రాంపూర్, చౌడాపూర్, మరికల్, కుల్కచర్ల తదితర గ్రామాల్లో గత వారం రోజుల నుంచి శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నారులు, విద్యార్థులకు ఆసనాలు, సూర్య నమస్కారాలు నేర్పించారు.



ఆసనాలు వేస్తున్న చిన్నారులు, విద్యార్థులు

దారిని నిర్మించి.. వెతలు తీర్చి



కరణ్‌కోట (తాండూరు గ్రామీణ), న్యూస్‌టుడే: దసరా పండుగరోజు గ్రామస్థులంతా పాదయాత్ర వెళ్లే మార్గంలో తాత్కాలిక రహదారి నిర్మించారు. గ్రామ శివారు నుంచి జమ్మి కుంట వరకు దారంతా బురదతో నీటి కుంటను తలపిస్తూ రాకపోకలకు ఇబ్బంది మారింది. దీంతో మాజీ ఎంపీపీ శరణబసప్ప జేసీబీ ఏర్పాటు చేయగా స్థానిక యువకులు సునీల్, ఇమ్రాన్, ఇద్రోస్ సహకారంతో సోమవారం రహదారి నిర్మించారు. పనులను మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్ పర్యవేక్షించారు. రహదారి అందుబాటులో రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

బాలిక అపహరణపై కేసు నమోదు

పూడూరు, న్యూస్‌టుడే: బాలికను అపహరించారని ఇచ్చిన ఫిర్యాదుతో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను మేడికొండకు చెందిన యువకుడు నవీన్ కొంత కాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇటీవల బాలికను ఇంటి నుంచి అపహరించినట్లు తెలిపారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



దాదాపూర్-మల్లేపల్లి మధ్య ఇలా..

దోమ మండల పరిధి దాదాపూర్-మల్లేపల్లి తారురోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయరైంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పొలాలు ఊటెక్కి నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో మట్టికోతకు గురై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. వాహనాలు ఎదురుగా వస్తే పక్కకు దిగితే కుంగిపోయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కసారి పొలాలు ఊటెక్కితే చాలు ఈ మార్గంలో వానాకాలం మొత్తం దారిపై నీరు పారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, దోమ**

సంతలో వసతులు లేక చింత

న్యూస్‌టుడే, యాలాల: రైతులు తమ పొలాల్లో పండించిన కూరగాయలు, నిత్యావసర సరుకులు విక్రయించడానికి వారంతపు సంతలో పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పల్లె సంతలో కనీస వసతులు లేవు. ప్రతి వారం సంతలో పంచాయతీలకు రుసుం చెల్లిస్తున్నా అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు లేక విక్రయ, కొనుగోలు దారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుస్థితి యాలాల, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల్లో నెలకొంది. యాలాలలో ఎనభై ఏళ్ల క్రితం నుంచి వారంతపు సంత నిర్వహిస్తున్నారు. నిజాం కాలంలో సంతలో గుర్రాలతో పాటు, సుగంధ ద్రవ్యాలు, జంతువుల తోళ్లు అమ్మేవారు. నాటి నుంచి వారంతపు సంత కొనసాగుతుంది. సంతలో డబ్బులు వసూలు చేసేందుకు ఏటా వేలం నిర్వహిస్తారు. తద్వారా పంచాయతీకి దాదాపు రూ.60వేల వరకు ఆదాయం సమకూరుతుంది. అయినా వసతులు మాత్రం శూన్యం. ఇప్పటికైనా సంతల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయా గ్రామాల్లో పరిస్థితి

యాలాల మండల కేంద్రంలో హనుమాన్ ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రతి సోమవారం సంత నిర్వహిస్తారు. యాలాలతో పాటు కిష్టపూర్, దేవనూర్, హాజిపూర్, సంగెం, విశ్వనాథ్‌పూర్, గోవింద్‌రావుపేట్, గోరెపల్లి తదితర చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సంతకు వస్తుంటారు. సంతలో తాగునీరు, శౌచాలయాలు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు, రైతులు ఎండ వేడిమికి తట్టుకోలేక గొడుగు నీడలో కూరగాయలు అమ్ముతున్నారు. రైతులు కూరగాయలు అమ్ముకోవడానికి సంతలో షెడ్లు లేక సీసీ రోడ్లు, వీధి సందుల్లో నేలపై కూర్చొని విక్రయిస్తున్నారు.



యాలాలలో నేలపైనే..

● పెద్దేముల్ మండలంలో ప్రతి మంగళవారం సంత నిర్వహిస్తుంటారు. దాదాపు పది పల్లెలకు సంబంధించిన గ్రామస్థులు కూరగాయలు కొనుగోలు చేసేందుకు సంతకు వస్తుంటారు. పెద్దేముల్‌లో ప్రధాన రహదారి పక్కన రైతులు కూరగాయలు విక్రయిస్తుండడం వల్ల కోట్‌పల్లి, ధారూర్, జహీరాబాద్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● బషీరాబాద్ మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారంతపు సంత జరుగుతుంది. మండల ప్రజలతో పాటు కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజలు కూడా సంతకు వచ్చి కూరగాయలు, నిత్యావసర సరుకులు తీసుకెళ్తారు. తాండూరు పట్టణం, కర్ణాటక సరిహద్దు రైతులు తమ పంట పొలాల్లో పండించిన తాజా కూరగాయలను ఇక్కడికి వచ్చి అమ్ముతారు. మౌలిక వసతులు కూడా లేవు.

వసతుల కల్పనకు ప్రతిపాదన పంపాం: ఆంజనేయులు గౌడ్, పంచాయతీ కార్యదర్శి, యాలాల

యాలాల వారంతపు సంతలో సౌకర్యాలు లేకపోవడం వాస్తవం. ప్రతిఏటా పంచాయతీకి వేలం ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఇందులో భాగంగా ప్రభుత్వానికి రూ.3లక్షలతో శౌచాలయాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తాం. షెడ్ల నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నాం.

పంచాయతీల్లో సీఎం చిత్రపటాల ఏర్పాటు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని తప్పనిసరి అమర్చాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మహిళలు, యువతులు బతుకమ్మ ఆడేందుకు వీలుగా పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేసేందుకు అవసరమైన మట్టిని సమకూర్చుకోవాలని సూచించారు. ఎంపీవో ఆనంద్‌రావు తదితరులున్నారు.

ఎంఈవోగా గోపాల్ బాధ్యతల స్వీకరణ

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండల ఎంఈవోగా ఎం.గోపాల్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంత వరకు ఇక్కడ పనిచేసి బాలానగర్‌కు బదిలీపై వెళ్లిన ఎంఈవో హరిశ్చందర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు గోపాల్‌ను సత్కరించారు.